క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం, తక్కెళ్ల పాడు, ఎర్రుపాలెం గ్రామాల్లో సాయిబాబా ఆలయాల్లో గురువారం సాయిబాబా విగ్రహాలకు శాస్త్రోక్తంగా, సాంప్రదాయబద్ధంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. బాబాకి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు బాబాని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో పలువురు దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సత్కారం

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడుకు చెందిన కూరపాటి ఉమ జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చి త్రిపురలోని ఎన్ఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా ఆమెను గురువారం ఎమ్మార్పీఎస్ నాయకుడు కూరపాటి సునీల్ మాదిగ, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూరపాటి కోటేశ్వరరావు, మైనర్ బాబు, స్వరాజ్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం

సత్తుపల్లిరూరల్: మండలంలోని సదాశివునిపేట శివారులో బుధవారం అర్ధరాత్రి క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లను గుర్తించిన స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సదాశివునిపేట శివారులోని చెరువుకు వెళ్లే రహదారిలో ముగ్గులు వేసి పసుపు, కుంకుమతో పూలు చేసినట్లు గురువారం ఉదయం గుర్తించారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇలా జరగకుండా అవగాహన కల్పించాలని వారు కోరారు.

ఉచిత వైద్యశిబిరం

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లిలో హైదరాబాద్‌కు చెందిన యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ కమల్, డాక్టర్ మానస లు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని సుధాకర్, తోటమళ్ల భరత్, నారాయణరావు, బాబునాయక్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ వితరణ



మహిళకు కుట్టు మిషన్ అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరాలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం కట్టా కృష్ణార్జున్‌రావు కుమార్తె స్నేహిత జన్మదిన వేడుకలను పురస్కరించుకొని నిరుపేద మహిళకు కుట్టుమిషన్‌ను వితరణగా అందించారు. లయన్స్‌క్లబ్ బాధ్యులు పెనుగుండ ఉపేంద్రరావు, కొల్ల రాంబాబు, చింతలపూడి వెంకటేశ్వరరావు, లగడపాటి ప్రభాకర్, వనమా విశ్వేశ్వరరావు, పెరుమాళ్ల కృష్ణామూర్తి, చింతోజు నాగేశ్వరరావు, మిట్టపల్లి సత్యంబాబు, నూకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిష్ అందజేత



విద్యార్థికి నగదు అందిస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని కేజీసిరిపురం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రూ.25 వేలు అందించారు. ధమెస్టార్ పెస్టిసైడ్స్ పురుగుల మందు కంపెనీ ఆధ్వర్యంలో.. గురువారం పాఠశాలలోని 10 మంది నిరుపేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున రూ.25వేలను స్కాలర్‌షిప్‌గా అందించడం జరిగింది. ఈ కంపెనీ వారు ప్రతీ సంవత్సరం దేశవ్యాప్తంగా 4వేలు మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ నగదు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం నాగభూషణం, సర్పంచ్ సత్యప్రసన్నాంభ, ఎంపీటీసీ కృష్ణారావు, వైరా మేనేజర్ కృష్ణ, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశువులను సంరక్షించాలి

మధిర: మండలంలోని ఇల్లెందులపాడు, నాగవరప్పాడు గ్రామాల్లో గురువారం పశు వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవరప్పాడు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మోరుబోయిన నాగమణి ప్రారంభించి మాట్లాడారు. పశువులను వ్యాధుల నుంచి రక్షించుకోవాలని, పశు వైద్యుల సలహాలు తీసుకోవాలని తెలిపారు. పశువులు మన ఆర్థిక స్థితికి, జీవనశైలికి ఎంతో దోహదపడుతున్నాయని అన్నారు. ఈ శిబిరాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి, నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రఫీ అహ్మద్, లక్ష్మణరావు, కొండలరావు, రమేష్, భాస్కర్, వెంకటేశ్వర్లు, సాయి చంద్రిక, జాన్ బీ, కరీమూన్, గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

చకచకా.. సర్వే



సత్తుపల్లి మున్సిపాలిటీలో దరఖాస్తులను పరిశీలిస్తున విచారణ బృందం

- 'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ
- లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక బృందాలు
- క్షేత్రస్థాయి విచారణలో నిమగ్నమైన యంత్రాంగం

సత్తుపల్లిటౌన్: పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టింది. ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మూడురోజుల పాటు దరఖాస్తులను స్వీకరించింది. సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీలతో పాటు రెవెన్యూ కార్యాలయాలలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షల ఆర్థిక సాయం చేసేందుకు ప్రభుత్వం ఈ ప్రక్రియను వేగవంతం చేసింది. ఇప్పటి వరకు సత్తుపల్లి మున్సిపాలిటీలో 1,032 మంది లబ్ధిదారులు 'గృహలక్ష్మి'కి దరఖాస్తు చేసుకోగా.. మధిర మున్సిపాలిటీలో 1,327, వైరా మున్సిపాలిటీలో 1,125 దరఖాస్తులు వచ్చాయి.

ప్రత్యేక బృందాలతో...

గృహలక్ష్మి పథకానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక బృందాలను నియమించింది. మున్సిపాలిటీల్లో అధికారులతో పాటు బిల్‌కలెక్టర్లు, ఆఫీస్ సిబ్బంది సర్వే చేస్తున్నారు. అదే విధంగా పంచాయతీలలో అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బందితో కలిసి పంచాయతీ కార్యదర్శులు బృందాలుగా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో సత్తుపల్లి మున్సిపాలిటీలో 28 మందితో ఐదు బృందాలు, మధిరలో 22 బృందాలు, వైరాలో 14 బృందాలు చొప్పున క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పూర్తి స్థాయిలో అర్హులను తేల్చే పనిలో నిమిగ్నమయ్యారు.

ప్రాధాన్యతా అంశాలు ఇవే..

లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వ్యూలను పరిగణలోకి తీసుకొని విచారణ బృందాలు సర్వే నిర్వహిస్తున్నాయి. మహిళ పేరుతో వచ్చిన దరఖాస్తులను మాత్రమే అర్హతకు ప్రాధాన్యత ఉంటుంది. దరఖాస్తు దారులు రేషన్‌కార్డు కలిగి ఉండాలి. అదే విధంగా సొంత స్థలం ఉండాలి. దరఖాస్తు చేసిన వారి కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి ఉంటే అనర్హులు, గుడిసె, గడ్డి ఇల్లు, తాటాకు ఇల్లు, రేకుల షెడ్డులో ఉండే వారికే ప్రాధాన్యత ఉంటుంది. దివ్యాంగులకు ఐదు శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ కేటగిరీలకు రిజర్వేషన్ కేటాయించారు. దరఖాస్తుదారులు రేషన్‌కార్డు, ఓటరు గుర్తింపుకార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం కలిగి ఉండాలి. 59 జీఓలో లబ్ధిపొందిన వారు అనర్హులు.

రుణ సాయం ఇలా..

ఎంపిక ప్రక్రియ ముగిశాక మంజూరు పత్రాలు అందిన తర్వాతే లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు చేపట్టారు. బేస్‌మెంట్ లెవల్‌లో రూ.లక్ష, శ్లాబ్ లెవల్‌లో రూ.లక్ష, పూర్తి నిర్మాణం అయ్యాక రూ.లక్ష చొప్పున అందిస్తారు.

పారదర్శకంగా విచారణ..



గృహలక్ష్మి పథకానికి లబ్ధి దారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వ్యూలకు అనుగుణంగా విచారణ జరుగుతుంది. ఈ నెల 20వ తేదీకల్లా లబ్ధిదారుల ఎంపికకు విచారణ చేసి ప్రభుత్వానికి జాబితాను పంపిస్తాం. మున్సిపాలిటీలో ప్రత్యేక బృందాలతో సర్వే నిర్వహిస్తున్నాం.

– కె.సుజాత, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

దరఖాస్తుల పరిశీలన..

తల్లాడ: తల్లాడ, అన్నారుగూడెం గ్రామ పంచాయతీల్లో గురువారం 'గృహలక్ష్మి'దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి సర్టిఫికెట్లు, ఇళ్ల స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో తల్లాడ గ్రామ పంచాయతీ ఈఓ ఉమా, అన్నారుగూడెం కార్యదర్శి వేణు, సిబ్బంది పాల్గొన్నారు.



అన్నారుగూడెంలో.. దరఖాస్తులను పరిశీలిస్తున్న కార్యదర్శి వేణు

'మన ఊరు - మన బడి' పనుల తనిఖీ



పనులను పరిశీలిస్తున్న అధికారులు

కారేపల్లి: కారేపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత సెంటర్‌ను విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్ రామకృష్ణ, కమ్యునిటీ మొబలైజేషన్ అధికారి(సీఎంఓ) వై.రాజశేఖర్‌లు గురువారం సందర్శించి పని తీరును పరిశీలించారు. ప్రత్యేక అవసరాల కోసం ఏర్పాటు చేసిన భవిత సెంటర్‌లో పిల్లల ప్రతిభ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. రొట్టమాకురేవులోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి మన ఊరు మన బడి పనులను తనిఖీ చేశారు. ఎంఎమ్‌సీ చైర్మన్ రాంబాబుతో మాట్లాడి పనులు వేగవంతం అయ్యేలా చూడాలని కోరారు. అధికారుల వెంట ఎంఐ మోతిలాల్, సీఆర్‌పీ రాణి, విజయ్‌కుమార్, ఉపాధ్యాయురాలు అశ్విని తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



తల్లాడ: తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

మధిర/తల్లాడ: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం మధిర, తల్లాడ తహసీల్‌ను ముట్టడించారు. మధిరలోని స్థానిక శ్రీనిధి కళాశాల నుంచి రైల్వేస్టేషన్, తెలంగాణ తల్లి విగ్రహం, మెయిన్ రోడ్డు మీదుగా తహసీల్ వరకు విద్యార్థులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బెజవాడ సాయి మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నప్పటికీ ఇంకా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు విద్యార్థులకు ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు కావడం లేదన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్ షిప్స్ వెంటనే విడుదల చేయాలని, కేజీ టు పీజీ విద్యను అందించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తల్లాడ, మధిర తహసీల్దార్లు రవికుమార్, స్వామిలకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందించారు. ఈ కార్యక్రమాలల్లో ఎస్ఎఫ్ఐ నాయకులు వీరేందర్, పవన్, అఖీల్, వరుణ్, మధు, వంగా దత్తు, నరేశ్, సాయి, సురేష్, రవి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమాలకు దిక్సూచి ఏఐఎస్ఎఫ్



మాట్లాడుతున్న పోటు ప్రసాద్

మధిర: విద్యార్థి ఉద్యమాలకు ఏఐఎస్ఎఫ్ దిక్సూచి వంటిదని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకుడు పోటు ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని సిరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద.. యూనియన్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన ఈ సంఘ 88వ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఏఐఎస్ఎఫ్ అరుణ శ్వేత పతాకాన్ని ఆవిష్కరించి, ఆ సంఘ కార్యకర్త చిన్న వెంకయ్య స్తూపానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం మా జన్మ హక్కు అంటూ జరిగిన సంగ్రామంలో ఉద్యమించిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని తెలిపారు. స్వాతంత్ర్య స్ఫూర్తితో ఉద్యమాలు నిర్మించాలని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామకృష్ణ, ఆనందరావు, నాగుల్ మీరా, మధు, ఉజ్వల్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించుకోవాలి



మొక్కకు నీరు పోస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అన్నారు. గురువారం వైరా మిషన్ భగీరథ ఆధ్వర్యంలో వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరిస్తున్న అడువులకు పూర్వవైభవం రావాలంటే ప్రతి ఒక్కరు ఉద్యమం మాదిరి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ వీరభద్రం, లెక్చరర్లు శ్రీనివాసరావు, సురేష్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీవిజయసాయి మందిరంలో అన్నదానం



అన్నం వడ్డిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని రాజీవ్‌నగర్ శ్రీ విజయసాయి ధ్యానమందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆత్మకమిటీ మాజీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండపల్లి రమేష్‌రెడ్డి, జశ్విత కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ గోగులమూడి బాలాజీరెడ్డి, దుగ్గిదేవర యుధీష్టర్ సహకారంతో అన్నదానం నిర్వహించారు. దీనిని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్ మహ్మద్ అనీషాలు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు రఫీ, మాధురి మధు, వీరిశెట్టి సురేష్, పసుమర్తి కృష్ణారావు, రామిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కొణిజర్ల: పోడు భూములకు పట్టాలివ్వాలని ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకునపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. మండంలో సీపీఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఎల్లన్ననగర్ పోడు భూములను సర్వే చేసి తక్షణమే హక్కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 22న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న నిరవధిక దీక్షలను విజయవంతం చేయాలన్నారు. ఖమ్మం జిల్లాలో 42వేల ఎకరాల పోడు భూములకు 18 వేల మంది దరఖాస్తులు చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 6,500 మందికి 13 వేల ఎకరాలు మాత్రమే హక్కు పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా పోడు పట్టాల కోసం పడిగాపులు కాస్తున్న ప్రతి ఒక్కరూ నిరవధిక దీక్షల్లో పాల్గొనాలన్నారు. సమావేశంలో కంకణాల అర్జున్‌రావు, పాశం అప్పారావు, తడికమళ్ల సీతారాములు, గుగులోతు శివ, ఆలకుంట శ్రీను, సురేష్, బలరాం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బల్లలు వితరణ



విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద సిమెంట్ బల్ల ఏర్పాటు చేసిన దృశ్యం

సత్తుపల్లిరూరల్: రిటైర్డ్ ఏఎల్ఎం పంతంగి చెన్నయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య కనకదుర్గ విద్యుత్ కార్యాలయానికి రెండు సిమెంట్ బల్లలను వితరణ చేశారు. ఇవి వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వినియోగదారులు కూర్చునేందుకు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో విద్యుశాఖ డీఈఈ రాములు, ఏడీఈ బి.ప్రసాద్‌బాబు, ఏఈ యు.శరత్‌బాబు ఉన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



తహసీల్దార్‌కి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

ఎర్రుపాలెం: కేసీఆర్ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నరసింహారావు, మండల కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావులు అన్నారు. బుధవారం మండలంలోని తహసీల్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా.. ఇప్పుడు కొత్తగా హామీలు ఇస్తూ మోసం చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఎన్ని ఎత్తులు వేసినా ఈ సారి బీఆర్ఎస్ ఓడిపోవడం ఖాయమన్నారు. అనంతరం తహసీల్దార్ ఉషాశారదకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, చంద్రమౌళి, ధనుంజయ శర్మ, రాముగౌడ్, గోపాలరావు, ప్రేమ్‌కుమార్, ఇస్రయ్య, అచ్చారావు, ధర్మారావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఇంటింటా లెప్రసీ సర్వే



అవగాహన కల్పిస్తున్న లంకా కొండయ్య

మధిర: దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇంటింటా లెప్రసీ సర్వే కార్యక్రమాన్ని గురువారం దెందుకూరు పీహెచ్‌సీ, లెప్రసీ అండ్ ఎయిడ్స్ నోడల్ అధికారి లంకా కొండయ్య ప్రారంభించారు. మహదేవపురం, రాయపట్నం గ్రామాల్లో వైద్య, ఐసీడీఎస్, మెప్మా, ఐకేపీ సిబ్బంది సర్వే చేసి మచ్చలను పరిశీలించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ.. కుష్టు వ్యాధి నివారణలో భాగంగా మొద్దుబారిన, గోధుమ, రాగి వర్ణం కలిగిన మచ్చలు, నొప్పిలేని, స్పర్శ లేని మచ్చలు ఉంటే పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. పలు రకాల మచ్చలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సుజాత, ఉషారాణి, శేషు కుమారి, కమల, జయమ్మ, పద్మావతి, కౌసల్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

సత్తుపల్లి: ఈ నెల 19న హైద్రాబాద్‌లో జరిగే మాదిగ జర్నలిస్టు ఫోరం(ఎంజేఎఫ్) జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ తడికమళ్ల దేవ పిలుపు నిచ్చారు. గురువారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించటం జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగతో పాటు మరికొందరు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు మాదిగ జర్నలిస్టులందరూ హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఐ.శ్రీను, బొల్లెపోగు సురేష్, తడికమళ్ల అప్పారావు, సింగపోగు శివకృష్ణ, కోటా అశోక్‌రాజా, విష్ణు, మోహన్, కృష్ణ, రాంకీ, రాజేష్, కొత్తపల్లి సుధాకర్, అలవాల శ్రీనివాసరావు, సాయి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవ

రైతుల పక్షపాతి కేసీఆర్



పాలాభిషేకం చేస్తున్న కృష్ణ ప్రసాద్, రైతులు

మధిర: రైతుల పక్షపాతి కేసీఆర్ అని రైతు సేవా సహకార సంఘం అధ్యక్షులు బిక్కి కృష్ణ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా మండలంలోని మధిర రైతు సేవా సహకార సంఘం కార్యాలయం వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారన్నారు.

కల్లూరు: కేసీఆర్ రైతుల రుణాలను మాఫీ చేయడంతో కల్లూరు సొసైటీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు హర్షం వ్యక్తం చేశారు. కల్లూరు సొసైటీ పరిధిలో 256 మంది రైతుల ఖాతాల్లో రూ.74 లక్షలు జమ కావడం జరిగిందన్నారు. రైతులకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకి సంబంధిత శాఖ మంత్రులకు, అధికారులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

పెనుబల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీవీఎస్(భారతీయ విద్యార్థి సేన) సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు సీహెచ్ తరుణ్, సందీప్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

చప్టా ఎత్తు పెంచండి సారూ..



ముదిగొండ మండలంలోని కట్టకూరు పంచాయతీలోని సీతారాంపురం వద్ద 30 ఏళ్ల నాటి చప్టా లోలెవల్‌లో ఉంది. దీనికి పైభాగాన మాదాపురం, కట్టకూరులకు సంబంధించిన పెద్దచెరువు ఉండడంతో ప్రతీ ఏటా వర్షాకాలంలో చప్టా నిండి అలుగు పడుతుంది. దీంతో ఆ పల్లె వాసులకు రాకపోకలు సాగవు. దీంతో గ్రామస్తులు పలుమార్లు ఓట్లకోసం వచ్చే ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకున్న నాధుడే లేడు. తమ ఊరి సమస్య తీరుతుందో లేదోనని గ్రామస్తులకు ఎదురు చూపులు తప్పడం లేదు. అదే విధంగా చిరుమర్రి గ్రామంలోని చప్టా పూర్తిగా దెబ్బతింది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లోలెవల్ చప్టా ఎత్తు పెంచాలని, చిరుమర్రి చప్టా మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : రాంబాబు, ఇరిగేషన్ డీఈ, ఖమ్మం

సెల్ నంబర్ : 9493474699



కల్లూరులోని ఎంఈఓ కార్యాలయం

కొరవడిన పర్యవేక్షణ

- 10 ఏళ్లుగా ఎంఈఓ లేక ఇన్‌చార్జ్ పాలన
- సమయపాలన పాటించని ఉపాధ్యాయులు
- శాశ్వత ఎంఈఓను నియమించాలని మండల ప్రజల వేడుకోలు

కల్లూరురూరల్ : మండలంలో గత 10 సంవత్సరాలుగా ఎంఈఓ లేకపోవడంతో ఇతర మండలాల వారిని ఇన్‌చార్జ్‌లుగా వేశారు. దీంతో విద్యాశాఖపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కొరవడింది. మన ఊరు – మన బడి'లతో పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించడం ఇన్‌చార్జ్‌లకు తలకు మించిన భారం అవుతోంది. ఈ మండలానికి ఏళ్ల తరబడి ఇన్‌చార్జ్‌లను నియమించి విద్యాశాఖను భ్రష్టు పట్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

పర్యవేక్షణ లోపంతో గాడితప్పిన విద్యాశాఖ..

ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయులు తమ విధులపై నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారని, ముఖ్యంగా సమయపాలన పాటించడం లేదనే విమర్శలు సార్వత్రా వినిపిస్తున్నాయి. మండలంలో 42 ప్రాథమిక పాఠశాలలు, 15 ప్రాథమికోన్నత పాఠశాలలు, హైస్కూళ్లు 9 ఉన్నాయి. ప్రాథమికొన్నత పాఠశాలల్లో 184 మంది టీచర్లకు గాను 138 మంది టీచర్లు ఉన్నారు. ఉన్నత పాఠశాలలో 108 మంది టీచర్లకు గాను 88మంది మాత్రమే ఉన్నారు. మొత్తం 226 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. మరో 66 టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

నామ మాత్రంగా సందర్శనలు..

కల్లూరు మండలంలో 226 మంది టీచర్లు పనిచేస్తుండగా ఇన్‌చార్జీ, ఎంఈఓలు నామమాత్రంగా సందర్శిస్తున్నారు. ఒక మండలంలో ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగులు ఏ శాఖలోను ఉండరు. శాశ్వత ఎంఈఓను కేటాయించకపోవడం దారుణం. బడిబాట కార్యక్రమంలో కొత్త విద్యార్థులను చేర్పు కోవటంలో టీచర్లు నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారని తెలిసింది.